# కోటిగాడు స్వతంత్రుడు

ఆ రోజు స్వాతంత్ర్య దినోత్సవం.

'ఆ ఉత్సవం ఒక మొక్కుబడిగా మిగిలింది!' అనడానికి నిదర్శనంగా పాఠశాలల్లో జాతీయ జండాలు ఎగరవేశారు. ఆ జండాకు మొక్కిన పిల్లలకు అర్థంకాని ఉపన్యాసాలతో పాటు మిఠాయిలు కూడా పంచి పెట్టారు. ఆ ఊళ్లో అక్కడక్కడా కొన్ని సభలు సమావేశాలు జరిగాయి. అలా జరిగిన ఒక సభలో ఖద్దరు ధరించిన స్థూలకాయుడు మైక్ ముందు నిలబడి-

"ఈరోజు ఆగష్టు పదిహేను. భారతదేశ చరిత్రలో ఈరోజు ఒక అరుదైన రోజు. ఒకప్పుడు భారతదేశం బానిసదేశం. భారతీయులు తెల్లవాళ్ల దృష్టిలో నల్లవాళ్లు. ఈ నల్లవాళ్లు ఆ తెల్ల వాళ్లకు బానిసలు. ఈ బానిసత్వాన్ని భరించలేని కొందరు మహనీయులు స్వాతంత్ర్యసమరం జరిపారు. నిజానికి ఆ పోరాటం ఎంతో శాంతియుతంగా జరిగినా, ఎంతోమంది ఆస్తిపాస్తులు దగ్ధమయ్యాయి. అసువులు గాలిలో కలిసిపోయాయి. జైళ్లు ఇండ్లయ్యాయి. ఏదిఏమైనా, స్వాతంత్ర్యసాధనే వాళ్ల ధ్యేయమయింది. పట్టుదలకు పరిశ్రమ తోడైతే ధ్యేయ సాధన! నల్లేరుపై నడక.

ఒక ఆగష్టు పదిహేనున భారతీయులు స్వతంత్రులయ్యారు. అప్పటి నుండి ప్రతి ఏటా ఆ తేదీన స్వాతంత్ర్యదినం జరుపుకొంటున్నాం. మొదట మొదట ఆ ఉత్సవాల్లో ఆనందావేశాలు మిళితమైవుండేవి. ఆ సంబరానికి పట్టపగ్గాలు ఉండేవికావు. రాను రాను ఆవేశం హరించుకుపోయి, ఆనందం మాత్రం మిగిలింది. ఇప్పుడు గతాన్ని తలచి గంతులు వేయడం మాని అంతో ఇంతో ప్రగతిపథం వైపు మొగ్గు చూపిస్తున్నాం.

ప్రగతి సాధన కార్యక్రమంగా జమీందారీ పద్ధతి రద్దయింది. భూస్వామ్య సంస్కరణలు అమలులోకి వచ్చాయి. బ్యాంకులు జాతి పరం అయ్యాయి. ఇలా ఎన్నో ఎన్నెన్నో కార్యక్రమాలు మిట్టనున్న వాణ్ణి పల్లానికి, పల్లంలో ఉన్న వాణ్ణి మిట్టకు లాగి సమతలంపై నిలబెట్టాలన్న ప్రయత్నంతో ప్రారంభమయ్యాయి. ఈ ప్రయత్నంలో భాగంగా ఈరోజు చిన్న దుకాణాలు

నడుపుకునే వాళ్లకు, వృత్తికారులకు, వీధులు తిరుగుతూ కూరగాయలు అమ్ముకునే వాళ్లకు, రిక్షా వాళ్లకు జాతి పరమైన బ్యాంకుల ద్వారా అప్పులిప్పిస్తున్నాం."

ఆమాట చెవిని పడడంతో....

కోటిగాడి మొగంలో కోటి దివ్వెలు ఒక్కసారిగా వెలిగాయి. కోటిగాణ్ణి ఇంట్లో వాళ్లమ్మ 'ఒరే! కోటయ్యా?' అని అప్యాయంగా పిలిచేది. ఇంటినుండి బయటపడితే స్నేహితులు 'ఒరే కోటీ!' అని ముద్దుగా పిలిచే వాళ్లు!. ఊళ్ళో వాళ్లేమో 'ఒరే కోటిగా!' అని దబాయించినట్లు పిలిచేవాళ్ళు. ఎవరు ఎలా పిలిచినా పలికేవాడు కోటిగాడు. 'ఎలా పిలిస్తే ఏముందిలే?' అని అనుకొనేవాడు. కానీ ఆరోజు మాత్రం 'కోటిగాడు' అన్న పిలుపు వినిపించేసరికి కోటిగాడి మొగంలో కోటి కాంతులు చోటు చేసుకొన్నాయి.

అదరా బాదరా పైకి లేచాడు. తడబడుతూ వేదిక వద్దకు నడిచాడు. ఒక్క ముంపులో ఎగిరి వేదిక మీద పడగల శక్తి ఉన్నా, వెనకా ముందాడుతూ వేదిక ఎక్కాడు. రిక్షా తొక్కి తొక్కి గూని పోయిన ఆకారం నిలబడితే వాడు వినయంగా వంగి నిలబడినట్లే ఉంది. వినయమంటే వాడికి అర్థం తెలియకపోయినా!

అందించిన కవర్ని వణుకుతున్న చేతులతో వినయంగా అందుకొన్నాడు. ఆ కవరందించిన పెద్ద మనిషికి ఒక దండం, ఏమరుగా కూర్చున్న ప్రజానీకానికి మరొక దండం పెట్టి వేదిక దిగాడు.

వేదిక దిగినా ఏనుగు నెక్కినంత సంబరం వాడిది!

వేదిక దిగిన కోటిగాడు నేరుగా వెళ్లి తన స్థానంలో కూర్చోకుండా వేదిక పక్కకు వెళ్లాడు. అక్కడ అప్పటికే అలాంటి కవర్లందుకొన్న కొంతమంది గుంపుచేరి ఉన్నారు. ఆ గుంపుతో చేరాడు కోటిగాడు.

అందరి మొగాలలో పువ్వులు పూస్తున్నాయి.

కోటిగాడికి కూడా అప్పు దొరికింది, కొత్త రిక్షా కొనుక్కోవడానికి!

పట్టలేని ఆనందం గుండెను దడదడలాడిస్తే కోటిగాడు కవరు విప్పాడు. కండ్లు మిల మిల మెరిశాయి. ఆ కవరు నిండుకు నోట్లు! అన్నీ 'పళ పళ' మంటున్న కొత్త నోట్లు! ఒకటిగాదు, రెండుగాదు - ఐదు వందలు!

కోటిగాడు బానిస దేశంలో పుట్టలేదు. స్వతంత్ర భారతదేశంలోనే పుట్టాడు. కాగా కోటిగాడు కడు స్వతంత్రుడు. అయినా వాడు పుట్టి బుద్ధి ఎరిగిన నాటి నుండి ఐదువందలు కాదుగదా ఐదు పదులైనా ఒక్కసారిగా కండ్లచూచిన పాపాన పోలేదు. అందుకే వాడి గుండె ఆనందంతో నిండి వాసంతంలో గంతులేసే లేడిపిల్లే అయింది.

ఇంతకాలంగా కోటిగాడు రిక్షా తొక్కే బ్రతికాడు. మరుసటి దినం నుండి కూడా రిక్షా తొక్కే బ్రతుకుతాడు. అయితే ఆ బ్రతుకులో ఎంత మార్పు!?

రిక్షా కోటిగాడు 'ఆపు!' అంటే రిక్షాను ఆపాడు. 'పద!' అంటే ముందుకు సాగాడు.

ఐదు నిమిషాలంటూ అర్థగంట ఆలస్యం చేసినా, ఎదురు చూస్తూ నిలబడ్డాడు. తొక్క గలిగిన చోట ఎక్కి తొక్కాడు. వీలుగాని చోట దిగి లాగాడు. మండుతున్న ఎండలో చెమటలు కక్కాడు. కురుస్తున్న వానలో తడిసి ముద్దయ్యాడు.

కోటిగాడికి మరునాటి నుండి కూడా ఈ సాధక బాధకాలు తప్పవు.

అయితే - 'రేపటి నుండి తన సంపాదనలో మూడువంతులు రిక్షా బాడుగ కింద చెల్లించాల్సిన అవసరం లేదు. తనదింక కూలి బతుకు కాదు.' ఆ ఊహే! కోటిగాడి మొగంలో కందిపూల కొత్త కాంతులు పూయించింది.

కొత్త రిక్షా. కొత్త బతుకు. కొత్త కొత్త ఆశలు. కోటిగాడు ఊహల్లో తేలిపోతూ డబ్బు జేబిలో భద్రపరచుకొన్నాడు.

సభ ముగిసింది. ఎవరి దారిన వాళ్లు వెళుతున్నారు. అయితే కవర్లందుకొన్న వాళ్లు మాత్రం కాలు కదపడంలేదు.

"ఇంక ఈడ నిలబడుకోని ఏం జెయ్యాలబ్బా? పోదాం పదండ్రా!" అన్నాడు కోటిగాడు.

"బలే వోడివే నువ్వు! అక్కర దీరితే అక్కమొగుడు కుక్కన్నట్టుందే నీయవ్వారం? పెంటయ్య రావద్దా?" ఎదురు పలికింది ఒక గొంతు.

పెంటయ్య కోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు.

పేరుకు పెంటయ్యే కానీ, ఆయన చాలా 'పెద్దయ్య.' ప్రజాసేవ ఆయనకు ఊపిరి. సభలు సమావేశాలు అంటే ఆయనకు అన్నపానాదులు. అలగా జనం ఆయనకు ఆప్తులు. రాజకీయ నాయకులు ఆయన జేబులో బొమ్మలు. బలహీన వర్గాల సమస్యలా? అరచేతిలో గీతలు.

ఊళ్లో ఏ రాజకీయ నాయకుడైనా ఎప్పుడైనా అడుగు పెడితే చాలు. ఆయన ముందు నిలబడతాడు. ఆయన వెనక వందలాది బక్క బడుగు ఆకారాలుంటాయి. -జై అనమంటే జై అనడానికి!

ఆ ఊళ్లో ఏ సభ అయినా సమావేశమైనా ఆయన లేకుండా జరగడానికి లేదు. ఒకవేళ జరిగినా ఫలితం జరిపించే వాళ్లకు తెలుసు కాబట్టి జరిపించరు.

అందువల్ల స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం పెంటయ్య భుజాలమీదనే నడిచింది. ఆ బరువును దులుపుకొని, స్వాగతం పలికిన పెద్దలకు వీడ్కోలు చెప్పి చేతికింద మెలిగే మూకకు అప్పగింతలు పలికి, పెంటయ్య బయలుదేరే సరికి కాస్త ఆలస్యమే అయింది.

అంత వరకు కవర్లు ఆయనగారి కోసం నిరీక్షిస్తూ నిలబడ్డాయి.

పెంటయ్య బయలుదేరాడు.

మందడి వెంటబడ్డ గొర్రెమందలా కవర్లు వెంటపడ్డాయి.

పెంటయ్య ముందు, కవర్లందుకున్న గుంపు వెనకగా ముందుకు నడిచారు. పెంటయ్య ఇంట్లో అడుగు పెట్టాడు.

నెత్తి బరువు నేల పడ్డట్టు నిట్టూరుస్తూ దర్జాగా కుర్చీలో ఆసీనుడయ్యాడు పెంటయ్య. ఏదో ఘనకార్యాన్ని సాధించిన తృప్తి అతని మొగంలో తొణికిస లాడుతూ ఉంది.

"ఏమి జన్మమో ఏం పాడో గానీ, ఏదైనా ఒక పని అనుకుంటే అయ్యేదాకా నిద్ర పట్టదు. ఈ బాధలన్నీ పళ్లేక ఎప్పటికప్పుడు అనుకుంటానే ఉండా, ఈ బాధలింక పళ్లేమని. అయినా మీ అగసాట్లు చూస్తావుంటే 'అయ్యో' మనిపిస్తింది. నాకు తెలవకుండానే తల దూర్చేస్తాను. అబ్బబ్బ! పెరుక్కోని బయట పడేకుందికి తల ప్రాణం తోక్కొస్తింది. అయినా ఏం చేద్దాం? తలకాయ ఉన్నంత కాలం పడిశం తప్పితిందా?" అక్కడున్న వాళ్లను ఉద్ధేశించినట్లు కాకుండా తనలో తాను గొణుక్కున్నాడు వాళ్లకు వినపడేటట్లుగా.

ఆ తరువాత-

"ఏం? అందరికీ డబ్బు అందినట్లే గదా?" అని అడిగాడు పెంటయ్య. ఆ మూక తోక ముడిచి ముక్త కంఠంతో 'చిత్తం' అనింది.

"అయితే ఇంకా ఆలస్యం చేస్తా ఉండారెందుకు? ఊఁ! మరి తెండి!తెండి !!" అడగడంలో దర్పం పొంగుతున్న ఎసరులా పైకి లేచింది.

ఒక్కొక్కడుగా రెండేసి వందలు ఎంచి ఇస్తూ ఉంటే నిర్లక్ష్యంగా కుడిచేత్తో అందుకొని ఎడమవైపు జేబులో కుక్కుకుంటున్నాడు పెంటయ్య.

కోటిగాడు మాత్రం మినకరిస్తూ ఒక మూల నిలబడ్డాడు. వాడికి ఈతంతు అంతు చిక్కడం లేదు.

"ఏమిరా? కోటిగా! అట్లా నసగతా నిలబణ్ణావే? ఏం సంగతి? తే తే! నాకింకా ఓపినన్ని పన్లుండాయి." అసహనంగా అడిగాడు పెంటయ్య.

"ఐదొందలు అప్పులో రెండొందలు నీకిచ్చేస్తే నేనింక రిచ్చా ఎట్టకొనాల? అప్పెట్లా తీర్చాల?" సందేహాన్ని వెలిబుచ్చాడు కోటిగాడు.

బాన కడుపు బద్దలయ్యేలా విరగబడి నవ్వాడు పెంటయ్య.

నవ్వుతున్న పెంటయ్యను, నవ్వుతుంటే కలిసి నవ్వకపోతే బాగుండదని ఆయనతో కలిపి నవ్వుతున్న గుంపును దేబెరించి చూస్తూ నిలబడ్డాడు కోటిగాడు.

నవ్వు ఆపుకోవడానికి పెంటయ్య కాస్త తంటాలు పడవలసి వచ్చింది.

"ఒరే కోటిగా! నీలాంటి పిచ్చోళ్లుండే గదరా ఈ దేశం ఇట్లైపోతా ఉండేది. నిన్ను రిచ్చా కొనమనిందెవుడు? అప్పు కట్ట మనిందెవుఢ్రా? చెప్పండయ్యా చెప్పండి! మీరన్నా వాడికి విడమరిచి చెప్పండి."

ఏం చెప్పాలో? ఎలా చెప్పాలో? తోచకుండా ఒకరి మొగం ఒకరు చూసుకుంటా నిలబడిందా గుంపు.

"ఏమండయ్యా? చెప్పేదానికి మీకు చేతకాలేదా? అయితే నేనే చెప్తా" అందర్నీ తేరిపార చూచి గొంతు సవరించుకున్నాడు పెంటయ్య.

"ఒరే కోటిగా! నీకు అప్పు పుట్టించడానికి రిచ్చా అడ్డం పెట్టుకోవాల్సి వచ్చింది. నాలాంటోళ్లు బతకడానికి నీలాంటోళ్ల అవసరం వచ్చింది. అంతేరా! అంతే!! రొండొందలిట్లా పారేసి మిగతా తీసుకొనిపో. గుడ్డా గుసురు కొనుక్కో! రొన్నాళ్ళు అంత పచ్చంగా తిని వెచ్చంగా పొణుకో!" పెంటయ్య ఉపదేశ వాక్యాలు కోటిగాడి చెవికెక్కలేదు. వాడి మనస్సంతా కొత్త రిక్షా ఎక్కి ఊరంతా తెగ తిరిగేస్తా ఉంటే ఎటూ తోచక అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు.

"అట్లా గుణస్తా ఉండావెందుకురా గుడ్డినాకొడకా! ఏందో నీ అబ్బ సొత్తు ఎత్తిచ్చినట్టు యాదన పడిపోతా ఉండావే? అహఁ! నీకేమైనా ఇల్లుందా? వాకిలుందా? బూమి బుట్రా ఉందా? ఏముందిరా నీకు? మరి? ఎవురి మొకం చూసుకొని ఇచ్చినారనుకున్నావురా ఈ అప్పు?"

ఆమాట అంటూ అందరి వైపు అసహనంగా చూశాడు పెంటయ్య. అందరు చేతులు ముడిచి తలలు తోకలు చేసి ఆడిస్తున్నారు. పెంటయ్య కాస్త శాంతించాడు.

"ఒరే కోటయ్యా! ఆ మాటకొస్తే ఈ అయిదొందల్లో పెద్ద బాగం నీదేరా పిచ్చోడా? నువ్విచ్చే ఇన్నూరుకింకా ఇరవైమంది మొగుళ్ళుండారు. తెలిసిందా? అంతేరా అంతే! పాపమని పాత కోకిస్తే ఇంటెనక్కుపోయి మూరేసుకుణ్ణిందంట నీమాదిర ఒకామె. ఈ యవ్వారం బాగుండాది కానీ తేరా తే!"

మంచిగానే కోటిగాణ్ణి వంచేశాడు పెంటయ్య.

వచ్చీ రాని మనస్సుతో ఆడీ ఆడని చేతులతో రెండు వందలు ఇవ్వలేక ఇచ్చాడు కోటిగాడు. వాడి మనస్సు బొచ్చు పీకేసిన కోడి అయింది.. కొత్త రిక్షా ఓనర్‌గా వాడు కట్టుకొన్న పేకమేడలు కంటెదుటే నిలువునా కూలిపోయాయి. ఒక నిముషం అక్కడ నిలబడలేక పోయాడు.

కోటిగాడు నడుస్తున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని గుండెలుబాదుకొంటూ గొంతుచించుకొని చాటాలని పరితపిస్తూ నడుస్తున్నాడు.

ఎవరితో చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? ఎలా చెప్పుకోవాలి?

రిక్షావాడు చెబితే వినేవాళ్లుంటారా ఈ లోకంలో?

పోనీ తాను చెప్తే ఎప్పుడు వినింది లోకం? వినకపోగా పైగా పట్టుకొని తన్నింది.

అమ్మ కూలీ నాలీ చేసి మానెడు నూకలు తెస్తే తాను కట్టెలమ్మి పావలా పరకా తెచ్చేవాడు. ఆ పల్లెటూళ్లో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా బ్రదుకు సాగిపోతూ ఉండేది. ఆ గానుగెద్దు బ్రదుకు అలాగే కొనసాగి ఉంటే ఏ చీకూ చింతా ఉండేది కాదు. తన కర్మ కాలకపోతే తమ్మిరెడ్డి చంగమనాయుడు దారి జగడం ఇంటిదాకా అన్నట్లు ముత్యాలమ్మ తిరణాల కోసం 'నువ్వెంత? అంటే నువ్వెంతరా?' అని జుట్లు పట్టుకోవాలా? ఆ సమయానికి తానక్కడే ఉండాలా? అంతటితో ఆగకుండా ఆ వ్యవహారం కోర్టుదాకెక్కాలా?

❋ ❋ ❋ ❋

నాలుగైదు బాటలు కలిసే కూడలి అది. ఆ కూడలి వద్ద నిలబడ్డాడు కోటిగాడు. ఎటు

పోవాలో తోచక ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆ బాటల్లో ఏ బాట మీద పడినా గమ్యస్థానం దొరుకుతుంది. అయితే మనిషి ఏదో ఒక బాట ఎన్నుకొంటాడు. అలా ఎందుకు చేస్తాడో అతనికే తెలియదు. అదే జీవితంలో విచిత్రం. ఎప్పుడు, ఎక్కడ ఎలా మలుపు తిరుగుతాయో జీవితాలు!

తనలో తాను నవ్వుకుంటూ నడుస్తున్నాడు ఒకానొక బాటమీద. అది ఎక్కడ చేరుస్తుందో ఏమో? కానీ మనస్సు మాత్రం తన దారి తాను వెదుక్కొనింది.

⁜ ✻ ✻ ✻

ఆ వ్యవహారం జరిగి నెల తిరగక ముందే ఒక రోజు మాటు మణిగిన వేళ తమ్మిరెడ్డి పిలిపిస్తే తాను వెళ్ళాడు.

" ఒరే కోటిగా! చూస్తివి గదరా నాయుడిగాడి నిక్కు? వాణ్ణి ఒక్క దినమయినా పదారుకమ్ములెనక్కు పంపించకుండా పోతే నేరెడ్డిబిడ్డే కాదనుకో! అయితే మువ్వారమంతా నీమీదే ఉండాది. జరిగింది జరిగినట్లు చెప్పు? ఆ మిందట నీ జరుగుబాటు నాకొదిలి పెట్టు. ఏమంటావ్?"

దాదాపు దబాయించినట్లే అడిగాడు తమ్మిరెడ్డి.

"అట్లాగేనయ్యా!" అన్నాడు తాను.

ఆ మరుసటి రోజు సందకాడ చంగమనాయుడు సరాసరి తన గుడిసింటికే వచ్చాడు. చీలుస్తున్న కట్టెల్ని ఎక్కడి వక్కడ వదిలేసి చేతిలో గొడ్డలి పక్కనబెట్టి రెండడుగుల్లో వచ్చి నాయుడు ముందు నిలబడ్డాడు.

"ఒరే కోటీ! ఎంతకాల మనిట్లా కట్టెలు కొట్టి చస్తావురా! ఒంట్లో రసి ఉణ్ణంత కాలం ఫరవాలేదునుకో! ఆ తరవాత? అందుకేరా ముందు చూపు ఉండాలన్నారు పెద్దోళ్ళు. నా మాటిన్నావంటే - ఆ ముత్తేలమ్మ సాచ్చిగా చెప్తా ఉండా - మూడంకణాల పూరిల్లు నాలుగు గుంటల మడి - ఏమంటావ్?"

ముంగాళ్ళకు బంధమే వేశాడు చంగమనాయుడు. ఎటూ నోరు కదపలేక గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు తాను.

"రెడ్డోడి తిమురు చూస్తివి గదరా! అయినా మణిసికి అంత పెగ్గె పనికి రాదురా! వాడి తిక్క కుదిరించకపోతే నేనబ్బా అమ్మకు కాదు పుట్టింది. అయితే అంతా నీ చేతుల్లో ఉండాది. ఏం చేస్తావో ఏమో మరి!"

రెండు చేతులు పట్టుకోలేదు కానీ పట్టుకున్నంత పని చేశాడు నాయుడు.

" అట్లాగేనయ్యా!" అన్నాడు తాను నంగిగా

కోర్టులో సాక్ష్యం చెప్పాలి. 'సాక్ష్యం' అంటే ఎవరివైపో ఒకరి వైపే చెప్పాలి. ఒకవైపు చెప్తే మరొక వైపు కన్నెర్ర చేస్తుంది. అదీ కాక వాళ్ళు పెద్దోళ్ళు. ఈరోజు జుట్లు జుట్లు పట్టుకొంటారు. మళ్ళీ అవసరమొస్తే చేయి చేయి కలుపుకుంటారు. ఎటొచ్చి యిద్దరి మధ్య యిరుక్కొని

పెరుక్కోలేక యాతన పడేది తనలాంటోళ్లే.

అటు నూయి. ఇటు గోయి. ఏం చేయటం? కోటిగాడు ఆలోచించాడు. తనచిన్న బుర్ర వేడెక్కే వరకు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా వాడికి తోచింది ఒక్కటే మార్గం!

రెక్కాడితే కాని డొక్కాడని బ్రతుకులకు చిత్తూరైనా పుత్తూరైనా కాకుంటే మరే ఊరైనా ఒక్కటే! లేదంటే ముసలామె ఉంది. ఎక్కడో అంత బ్రతుకు తెరువు దొరికితే ఆ తరువాత ఆమెను పిలుచుకొనిపోతే సరిపోతుంది.

ఈ నిర్ణయంతో ఒక అర్థరాత్రి ఇంటి నుండి బయటపడ్డాడు.

కొత్త జీవితం మీద కోటి ఆశలు. కనిపెంచిన తల్లిని పుట్టి పెరిగిన మట్టిని విడిచి పెడుతున్నందుకు గుండెల నిండుకు కొండంత గుబులు.

భళ్లుమని తెల్లారే వరకు నడిచాడు.

కనుచూపు మేరలో ఒక పెద్ద పట్టణం. ఆ పట్టణంలో పెద్ద పెద్ద భవనాలు అందంగా కనిపిస్తున్నాయి. ఆ పట్టణానికి మధ్యగా ఆ భవనాలను మించి వాడి ఆశలకు ప్రతీకగా ఒక ఎత్తయిన గోపురం. ఒంగోలు గిత్త మూపురంలా కనిపిస్తూ ఉంది. గోపురం ఉంటే గుడీ ఉంటుంది. గుడి ఉంటే గుళ్ళో దేవుడూ ఉంటాడు. దేవుడు ఉంటే ఊళ్ళో నిజంగా దేవుడి లాంటి మనుషులే ఉంటారు. అంత మంచి ఊళ్ళో ఇంత చిన్న ప్రాణానికి రవ్వంత చోటు దొరక్కపోతుందా?

కోటిగాడికి ప్రాణం లేచి వచ్చింది. మరీ తెంపుగా నడుస్తున్నాడు.

ఆ పట్టణంలో ఉన్న పెద్ద పెద్ద భవనాలు పెరిగిపోతున్న జనాభాకు చాలవన్నట్టుగా అంతకంటే పెద్ద పెద్ద భవనాల్ని కడుతున్నారు ఊరి ముందర. ఆశగా అక్కడికి వెళ్ళాడు. ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆలోచించాల్సిన అవసరం లేకనే నేలమీద తట్ట నెత్తికెక్కింది.

పొద్దుగూట్లో పడేదాక తట్టమోస్తే పొట్ట గడుస్తూ ఉంది.

'బయలుదేరిన వేళా విశేషం మంచిదే!' అనుకొన్నాడు. కాలికి కాలు కొట్టుకుంటూ అడవుల మీదపడి కట్టెలు తేవడం కంటే తట్ట మోయడం సులువుగా ఉంది. నాలుగు రాళ్లు వెనక పడితే అమ్మను పిలుచుకొని రావాలి అనుకున్నాడు.

అంతవరకు బాగానే ఉంది. అయితే-

ఒకరోజు వేళకాని వేళ అనుకోనట్లుగా ఇంజనీరు వచ్చాడు తనిఖీ కోసం. ఆ సమయాన సిమెంటు ఇసుక కలగలుపుతున్నారు కూలీలు. అక్కడ ఒక్క క్షణం నిలబడ్డాడు ఇంజనీర్!

"ఎన్ని తట్టల ఇసుకకు ఎన్ని తట్టల సిమెంటు?" ఇంజనీర్ అడిగాడు.

"ఆరు కొకటేస్తా ఉండామ్ సార్!" అన్నాడు కూలీల మేస్త్రీ. వాడు పాత పందికొక్కు. ఎవరికెలా చెప్పాలో వాడికి బాగా తెలుసు.

"ఒరే! ఒరే! అపద్దం చెప్తే ఆడబిడ్డలు పుట్టారంట్రే! పది కొకటేస్తా ఆరు కొకటంటావు గదరా అన్నాయస్తుడా?" అమాయకంగా అన్నాడో? అలోచించే అన్నాడో? అనకూడని మాట

అనేశాడు కోటిగాడు.

చివ్వున పైకి లేచాడు ఇంజనీర్.

గాలికి ఎగిరే కాగితం మీద బరువు పెడితే ఎగరదు. అరిచే కుక్క నోటికి కవళం పడితే అరవదు. కోపం వచ్చినపుడు ఈ కోవకు చెందుతారు ఆఫీసర్లు అని ఎరిగిన కాంట్రాక్టర్ అత్యంత చాకచక్యంతో ఆఫీసరు జేబులో బరువు పెట్టాడు. బరువుపడేటప్పటికి ఎగరడం మాని వగర్చడాని కారంభించాడు ఇంజనీర్.

"ఇదో ఇలాంటి మాటలు ఇంక చెవిని పడితే టెండర్లే కాన్సిల్ చేస్తా! ఏమనుకున్నావేమో? జాగ్రత్త!" అని హెచ్చరిస్తూ బయలుదేరాడు ఇంజనీర్ జేబులో బరువుతో నిలబడలేక.

ఇంజనీర్ అటు వెళ్ళడం, కంట్రాక్టర్ ఎగిరి నడ్డిమీద తన్నడం, కోటిగాడు నడిరోడ్డులో బోర్లగిలా పడడం అతి సహజంగా, సవ్యంగా జరిగిపోయాయి.

కోటిగాడు పైకి లేచాడు. తిరిగి చూడకుండా ముందుకు నడుస్తున్నాడు.

దేవుడుండే ఆ పట్టణంలో ఒక దేశనాయకుడి పేరుమీద వెలిసిందా రాజవీధి. పేరు గాంధీరోడ్డు.

గాంధీరోడ్డులో బట్టల కొట్లు ఉన్నాయి. ఫ్యాన్సీ షాపులు ఉన్నాయి. పాత్రల అంగళ్ళు ఉన్నాయి. మెడికల్ షాపులు ఉన్నాయి. మాంసాహార, శాకాహార హోటళ్ళు ఉన్నాయి. ఫోటో స్టూడియోలు ఉన్నాయి. అక్కడక్కడ ఈ అంగళ్ల మధ్య అలంకార ప్రాయంగా బ్రాందీషాపులు ఉన్నాయి.

ఈ అంగళ్ళన్నింటి ముందు రోడ్డు కిటువైపు, అటువైపు రోడ్డంతా వ్యాపించి కలిగినవాడి నీడలో బతికే లేనివాడిలా చిన్న చిన్న కొట్లు ఉన్నాయి. నాలుగు చక్రాల బండ్ల మీద పండ్ల అంగళ్ళు నాలుగు బార్లకు ఒకటి ఉన్నాయి. ఆ బండ్లమీద ఒయ్యారంగా వాలి ఒక ద్రాక్షపండునో, జామపండునో కొరికి తింటూ పోలీసువాళ్లు ఉన్నారు. ఏమారితే పిడికెడు ఆకు కూరనో, లేదు అరటి పండ్లనో నోటి కందుకోవడానికి ఆవులు ఉన్నాయి, గేదెలు ఉన్నాయి. మేక పోతులు ఉన్నాయి. వీటన్నింటితో కలిసి మనుషులూ ఉన్నారు.

ఆ రోడ్డుమీద నిలబడ్డాడు కోటిగాడు.

అక్కడ ఎవరిదారి వాళ్లదిగా ఉంది. ఎవరి పని వాళ్లదిగా ఉంది. ఎవరి మాట వాళ్లదిగా ఉంది.

"ఏం చెయ్యాల? ఏం చెయ్యాల?" అని తనలో తాను గొణుక్కున్నాడు.

ఆకలి పీకుతూ ఉంది. నిలబడలేక అంగడి ముందు కూర్చున్నాడు. కూర్చున్నా నిలుచుకొన్నా ఆకలి ఆకలే! ఆకలి తీరాలంటే అంతో ఇంతో పడాలి. అంతో ఇంతో పడాలంటే డబ్బు కావాలి. అదే లేదు తన దగ్గర. ఏం చేయాలి?

"ఏం చెయ్యాల? ఏం చెయ్యాల?" అనుకుంటూ నడుస్తున్నాడు కోటిగాడు అంతకంటే చేసేదిలేక, తెలియక.

అక్కడ వరసగా అయిదారు హోటళ్ళు. ఆ హోటళ్ళ ముందు నిలబడి వచ్చిపోయే వాళ్ళను 'భోజనం చేస్తావా బాబూ! చేస్తావా బాబూ'' అని ఆప్యాయంగా అడుగుతున్నారు.

ఆశ్చర్యంగా చూస్తూ అక్కడ నిలబడ్డాడు కోటిగాడు.

'భోజనం చేస్తావా, బాబూ!' ఎవడో ఒకడు అడిగాడు ముద్దుగా.

ఆనందంగా తల ఆడించాడు కోటిగాడు.

సాదరంగా లోనికి పంపాడు కోటిగాణ్ణి

అక్కడ వాడు జంకుతూ ఒదిగి వారగా నిలబడితే టేబిలు ముందు కూర్చోమన్నారు. ఒకడు విస్తరి పరిచాడు. ఒకడు నీళ్ళు పెట్టాడు.

మరొకడు విస్తరి నిండుకు అన్నం పెట్టాడు. ఇంకొకడు కూరలు వడ్డించాడు.

ఆవురావురుమని ఆకలి. ఆకుమీద పోరకలాడింది.

''కోడికూర వేంపుడు. చేపల పులుసు. తలకాయ కూర. పెట్టమంటావా, బాబూ!'' ఇంకొకడు అడుగుతున్నాడు.

వాళ్ల ఆదరాభిమానానికి ముగ్ధుడైపోయాడు కోటిగాడు. దేవుడున్న ఊళ్ళో దేవుడిలాంటి మనుషులే! అనుకున్నాడు. నోటి నిండుకు కూడు. బదులు చెప్పలేక జోరుగా తల ఆడించాడు.

అడిగి అడిగి వడ్డిస్తే తుమ్మితే ముక్కులో నుండి పడేదాకా మెక్కాడు. తృప్తిగా త్రేన్చుతూ బయటికి నడుస్తున్నాడు. 'తొమ్మిదిన్నర!' అని ఒక గావుకేక పెట్టాడు సర్వర్.

తనకేమీ పట్టనట్లుగా, తన లోకం తనదిగా హాయిగా నడుస్తున్నాడు కోటిగాడు. అంతలో ఎవరో జబ్బపట్టి 'బిల్లు చెల్లించరా బేటా!' అన్నాడు.

తెల్లమొగం వేశాడు కోటిగాడు. అంతలోనే తెపురుకొన్నాడు.

''ఇదేమి అన్యాయమయ్యా? పిల్చి కూడంత బెట్టి దుడ్డడుగుతుండారే?''

వాడి మాటలకు పగలబడి నవ్వింది హోటల్.

''ఇది సత్రం కాదురా కొడకా! హోటల్!''

'బోజనం చేస్తావా బాబూ!'' అని ఎంతో మర్యాద చూపిన వాడే మర్యాద తప్పి మాట్లాడుతున్నాడు.

''అదేందయ్యా అట్లా మాట్లాడ్తా ఉండారే? ఓటల్లో అయితే అడిగితేనే పెట్టాల. అడక్కుండానే అడిగడిగి పెడ్తిరి. మా ఊళ్లో కూడా పండగ పబ్బాలకు ఇట్లానే పిల్చి పిల్చి పెడ్తారు. అట్టా మాదిరే అనుకుంటి. 'ఎంత మంచోళ్ళు!' అని అనుకుంటా పెట్టింది తింటి. ఇప్పుడు దుడ్డడిగితే నేనేం జేసేది?''

కోటిగాడి నంగి మాటలకు పగలబడి కాదు, వగలబడి నవ్వింది హోటల్. ''ఏం చేయాలా? ఏం చేయాలో చెప్తాంరా?'' అంటూ మెడబట్టి గెంటారు. కొంతకాలం ఎంగిలి గిన్నెల్ని ఎత్తుకొని ఇంకొకడి ముందు కుప్పపోశాడు. ఆ తరవాత ఆకు పరిచి నీళ్ళు పెట్టాడు. తరవాత సర్వర్ అయ్యాడు.

మూడు పూటలు ముక్కు వరకు మెక్కడం. నీడపాటున ఉండడం మనిషి మిసమిస లాడుతున్నాడు. అలాగే కొనసాగి ఉంటే అదొక తీరుగా ఉండేది. కానీ ...

ఒకరోజు ఆరబోసిన అన్నం మింద సున్నపు నీళ్ళు చల్లుతున్న దృశ్యం వాడి కంట పడింది. వాడి కడుపు రగిలిపోయింది. చూస్తూ చూస్తూ ఊరికే ఉండలేక పోయాడు. 'తినేవాళ్ళ నోళ్ళు ఈళ్లు కొడ్తే ఈళ్ళ నోళ్ళు దేవుడే కొడ్తాడు.'' అనకూడని మాట అననే అన్నాడు. ఆ మాట అనుకోకుండా అక్కడికి వచ్చిన యజమాని చెవిని పడింది. మాటతోకూడా వాడి నోటిమీద దెబ్బ పడింది.

ఆ దెబ్బతో వీధిలో పడ్డాడు.

ఇప్పుడు ఒంట్లో కాస్త సత్తువ ఉంది కాబట్టి ఆ దెబ్బకు తట్టుకొని నిలబడ్డాడు. నిలబడి 'ఏం చేయాల?' అని ఆలోచిస్తున్నాడు.

తలమీద కుచ్చుల కుళ్లాయి. నోట్లో సిగరెట్టు. కాళ్ళకు ప్లాస్టిక్ చెప్పులు. రిక్షాహాండిల్ బార్‌కు మల్లెల సరాలు. రిక్షాలో చుక్కలాంటి చక్కని చుక్క!

దర్జాగా తొక్కుతున్నాడొకడు రిక్షా.

'ఇదీ సొతంత్రమయిన బతుకంటే!' అనుకొన్నాడు కోటిగాడు.

ఆనాటి నుండి రిక్షా తొక్కుతున్నాడు. ఆశగా తొక్కుతున్నాడు. ఏనాటికయినా తొక్కేవాడిదే రిక్షా కాకపోదులే అన్న ధైర్యంతో తొక్కుతున్నాడు. ఆ ఊళ్లో ఎందరో ఒకప్పుడు రిక్షా తొక్కినవాళ్ళు, ఇప్పుడు ఒకటికి పది రిక్షాల 'ఓనర్లు' అయ్యారు. 'తనకూ అలాంటి అవకాశం రాకపోదులే' అన్న ఆత్మ విశ్వాసంతో తొక్కుతున్నాడు.

అవకాశం వచ్చింది. అయితే 'రానూ వచ్చె. పోనూ పాయె.!' అన్నట్లు చేజారిపోయింది. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన కోటిగాడు అమాంతంగా పాతాళంలో పడిపోయాడు.

❋ ❋ ❋ ❋

కోటిగాడు నడుస్తున్నాడు. కొంపలు తగలబడినంత బాధతో నడుస్తున్నాడు. నడిచి నడిచి బాగా అలిసిపోయాడు.

అలిసిపోయిన కోటిగాణ్ణి చేరదీసి సేదదీర్చడానికి అమ్మలేదు. ఈ దేశంలో అనాథలకు అమ్మతనాన్ని అందించే యోగ్యత కలిగింది ఒక్కటే ఒక్కటి. అది గవర్నమెంటు సారాయి అంగడి.!

స్వాతంత్ర్యదినోత్సవం అప్పులేక పప్పు కూడు. కోటిగాడికి సారాయికి అంగడి పోవలసిన గతి పట్టలేదు. సరాసరి బ్రాందీ అంగడికే నడిచాడు.

బ్రాందీ అంగడి ముందు నిలబడ్డాడు ఒక్క క్షణం. అటు చూశాడు. గాంధీ బొమ్మ. చేతులెత్తి ఒక్క దండం పెట్టాడు. ఇటు చూశాడు. బ్రాందీ అంగడి. చేతులు జోడించి రెండు దండాలు పెట్టాడు. మళ్ళీ గాంధీగారి వైపు తిరిగాడు.

''ఓ పెద్దాయినా! పొద్దన అందుఋూ నిన్ను గురించి మాట్లాడేవోళ్ళే! నువ్వు సొతంత్రం

తెప్పించినావంట. మాలాంటోళ్ళు యాళకంత తిండీ గుడ్డ సొతంత్రంగా సంపాయించుకోవాలని సతపోరి నావంట. ఇంకా ఏమేమో జెప్పిరి. ఇన్నెప్పుడు అంతా తెలిసినట్టే ఉండె. ఇప్పుడు సెప్పుకుందామంటే శాతగాకుండా ఉండాది. అదట్లాపోనీ! పొద్దుగూకులూ ఈ దోవమిందనే రిక్షా తొక్కుంటూ ఎన్ని సార్లు పొయ్‌నానో ఏమో? లెక్కేలేదు. అయితే మాత్రం మాయబ్బతో చెప్తావుండా. నువ్వీడున్నట్లే తెల్దు. ఇప్పుడు తెలుసుకున్నా!- కాస్సేపు ఉండు. వచ్చేస్తా! ఇయ్యాళ నీతో శానా శానా చెప్పకోవాల."

గాంధీగారి దగ్గర సెలవు తీసుకొని కోటిగాడు బ్రాందీ అంగట్లో దూరాడు.

ఒక చిన్న సీసా మందును రెండు సోడాలతో కలిపి రెండుగుక్కల్లో గుటగుట తాగేశాడు. అలుపు ఆవిరై పోయింది. హాయి గుండెల్లో గూడు కట్టుకుంటూ ఉంది. తూలుతూ తేలుతూ వచ్చి కోటిగాడు గాంధీగారి ముందు నిలబడ్డాడు.

"అహః! నువ్వే జెప్పు సామీ! ఇదేమన్నా బాగుందంటావా? అప్పు తీసిస్తానని. కొత్తరిచ్చా కొనుక్కోవచ్చని ఆశ చూపెట్రి. నా బతుకు నాదిగా సొతంత్రంగా బతకదామనుకుంటి. ఇచ్చినట్లిచ్చి మల్లా పెరుక్కుంటారా? నువ్వే గదా సామీ వాళ్ళకి సొతంత్రం ఇచ్చింది? ఇందుకేనా సామీ సొతంత్రం వచ్చింది?"

గాంధీగారు బోసినవ్వులు నవ్వుతూనే ఉన్నాడు.

"అదేంది సామీ, నేను చెప్తావుంటే నువ్వు నవ్వతానే ఉండావే? నా బాద నీకు చీమ కుట్టినట్లనిపించలేదే? 'వాళ్ళు చేసింది మంచి పనేలే!' అని నవ్వతా ఉండావా? అవున్లే! నేను రిచ్చా కొనుక్కోనుంటే నాకు బాద్దేతుండేది. పొద్దస్తమానం రిక్షా తొక్కాల. అప్పు తీర్చాల. ఇంత బాద్దిత నెత్తినుంటే నాకు సొతంత్రం యాడుంటింది? అసలు బాద్దేతుండే బతుకులకు సొతంత్రం యాడ ఏడిసింది? నువ్వు కావాలనుకున్నింది సొతంత్రం. అయితే నే నిప్పుడు సొతంత్రుణ్ణి. నే నేమయినా చెయ్యొచ్చు. జై గాందీ మాత్మాకూ జై!"

గబగబ బ్రాందీ అంగట్లో దూరాడు కోటిగాడు. సీసామీద సీసా సోడాతో కలిపి పట్టించాడు. వాడి కాళ్ళు తేలిపోతున్నాయి. ఒళ్ళు సోలిపోతూ ఉంది.

జేబులో భద్రపరచిన డబ్బును చేతికందుకొన్నాడు కోటిగాడు.

అప్పటికే ఆ బ్రాందీ అంగట్లో చాలామంది స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వ స్వతంత్రంగా హాయిలో తేలిపోతున్నారు. వాళ్ళందరికీ డబ్బులు ఇవ్వబోతున్నాడు. వీడి స్థితిలోనే వాళ్ళూ ఉన్నారు. వీడికి డబ్బు విలువ తెలియనట్టే వాళ్ళకూ తెలియలేదు. అందుకే అందరూ వాడివైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అదేందబ్బా అట్లా చూస్తా ఉండారే! ఈడేంది దుడ్లు యిట్లిచ్చేస్తా ఉండాడని గదా? ఒరే పిచ్చినాయాలి గుంపా! ఇది అప్పుదెచ్చిన దుడ్డుగాదురా. తేరకొచ్చింది. నేనొకరి కియ్యాల్సిన పన్లేదు. మీరు నా కియ్యాల్సిన పన్లేదు. తీసుకోండ్రా!"

కోటిగాడు బలవంతం చేస్తున్నాడు. అందరు విస్తుబోయి చూస్తున్నారు.

"మాయబ్బతో చెప్తా ఉండా! ఈమాట పెంటయ్యే చెప్పినాడు. రెండునాళ్లు పచ్చంగా తిని ఎచ్చంగా పాణుకోమన్నాడు. నేనొకడే రొన్నాళ్ళు తినేదాని కంటే మనమంతా కలసి ఒక్క దినమే పచ్చంగా తిని ఎచ్చంగా పాణుకుంటే పోలా? ఏం తప్పా? తీసుకోండ్రా! తీసుకోండి! ఎర్రిమొగం నాయాండ్లాలా తీసుకోండి!" అంటూ చేతిలోని నోట్లని వెదజల్లాడు కోటిగాడు.

బ్రాందీ షాపులోని ఫాన్ గాలికి రెక్కలు విప్పిన పావురాళ్ళులా ఎగురుతున్నాయి నోట్లు.

తూలుతూ సోలుతూ నవ్వుల్లో తేలిపోతూ మళ్ళీ గాంధీ విగ్రహం ముందు కూలబడ్డాడు కోటిగాడు.

"సామీ! సొతంత్రం! సొతంత్రం! అని నువ్విట్లా నిలబడి పొయ్‌నావు. సొతంత్రంగా బతగదామనుకుంటే నేనిట్లా నిలబడి పొయ్‌నా! మనిద్దరూ ఒకటే సామీ! లేదంటే - నేను తాగినాను. నువ్వు తాగలేదు. ఒకరు తాగి యింకొకరు తాక్కపోతే అది వలపచ్చం. వలపచ్చం తప్పుసామీ! అంత తాగు. తాగకపోతివో నామిందొట్టే!"

బ్రతిమాలుతున్నాడు కోటిగాడు.

గాంధీ విగ్రహం ముందు బ్రాందీ అంగడి పెట్టడానికి అనుమతించిన ప్రజలు కోటిగాడు గాంధీగారిని బ్రాందీ త్రాగమని బ్రతిమాలుతూంటే - నవ్వుతూ అదొక వింతగా చూస్తున్నారు. ఇంత జరిగినా గాంధీగారి బోసినోటి పెదాలపై సహజమైన చిరునవ్వు ఏమాత్రం చెరగలేదు. ఆ బోసి నవ్వు సాక్షిగా ఆకాశంలో ఎగురుతున్న ఓ పిట్ట వేసిన రెట్ట మహాత్ముడి తలమీద టప్‌మని పడింది!●

*ఆంధ్రప్రభ (3-2-80)*